క్లుప్తంగా

ఉపకరణాల ఎంపిక పరీక్షలు

రణస్థలం: స్థానిక జెడ్పీహెచ్ స్కూల్‌లో ఈనెల 27వ తేదీన ఆలీమాకో సంస్థ ఆధ్వర్యంలో 6 నుంచి 18 సంవత్సరాల్లోపు దివ్యాంగులకు ఉపకరణాల ఎంపిక పరీక్షలు నిర్వహించనున్నట్లు నాలుగు మండలాల విద్యాశాఖ అధికారులు, ఐఈఆర్పీలు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎచ్చెర్ల నియోజకవర్గ స్థాయి పరిధిలో లావేరు, జి.సిగడాం, ఎచ్చెర్ల, రణస్థలం మండలంలో ఉన్న అర్హులైన దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, యుడీఐడీ కార్డు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాన్ కార్డు, పాస్‌ఫొటోతో హాజరవ్వాలని సూచించారు. మరిన్ని వివరాలకు 96408 61859, 97059 27962 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పారిశుద్ధ్య పనులను చేపడుతున్న దృశ్యం

ఎచ్చెర్ల: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో రామ్మోహన్‌నాయుడు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను గురువారం చేపట్టారు. ఇక్కడ చెత్తాచెదారాలను తొలగించి డంపింగ్ యార్డుకు తరలించారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీవో శోభాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల పరిశీలన



కాలనీ ప్రజలతో మాట్లాడుతున్న జేఈ పీటీరావు

ఎచ్చెర్ల: మండలంలోని చిలకపాలేంలో మర్రిచెట్ల ఊడలు వలన ఇళ్లు దెబ్బతింటున్నాయని వికలాంగుల కాలనీకి చెందిన సహదేవుడు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్‌అండ్‌బీ జేఈ పీటీరావు కాలనీలోని చెట్లు, ఇళ్లను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలు మాట్లాడుతూ.. ఊడలు కూడా చెట్లులాగే విపరీతంగా పెరిగిపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలియజేశారు. అందువలన తొలగించే ఏర్పాట్లు చేయాలని కోరారు. జేఈ మాట్లాడుతూ ఇక్కడి పరిస్థితులపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేసి, వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అన్నప్రసాద వితరణ



అన్నప్రసాదం వితరణ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): అన్నదానం మహోత్తర కార్యక్రమమని వైఎస్సార్‌సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. నగరంలోని హడ్కో కాలనీలో కేబీటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గా మండపం వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చింతాడ వరుణ్, హడ్కోకాలనీ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఆబోతుల రామ్మోహన్, రౌతు సింహాచలం, హరి, శంకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం



బోల్తాపడిన వాహనం

జి.సిగడాం: రాజాం – చిలకపాలెం ప్రధాన రహదారిలో ఉన్న వాంగ్రంగి రైల్వే వంతెన సమీపంలో బుధవారం రాత్రి ఇథైల్ ఆల్కహాల్ తీసుకొని వెళ్తున్న భారీ వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఈ లారీ ఒడిశా నుంచి కృష్ణాపట్నం పోర్టుకు వెళ్తోంది. వాంగ్రంగి వంతెన నుంచి ఆనందపురం వంతెన మధ్యలో భారీ మలుపు ఉండడంతో వాహనం వంతెన వైపు బోల్తాపడింది. అయితే ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణహాని జరగలేదు. దీంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. గురువారం ఉదయం నుంచి జి.సిగడాం పోలీసులు, పొందూరు అగ్నిమాపక సిబ్బంది ప్రత్యేక యంత్రాలతో ఈ వాహనం తీశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

వైభవంగా కొత్తమ్మ తల్లి ఉత్సవం



వేషధారణల్లో కళాకారులు

గార: మండలంలోని జొన్నలపాడు కాలనీ గ్రామదేవత కొత్తమ్మ తల్లి ఉత్సవం భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. గురువారం సాయంత్రం ప్రతీ ఇంటి నుంచి ముర్రాటలు తీసుకొని వెళ్లి అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. పదేళ్లకొకసారి జరిగే ఈ వేడుకలో పలు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కలుపు.. నివారిస్తే గెలుపు..!

- నస్యరక్షణ చర్యలు తప్పనిసరి
- నివారించకుంటే దిగుబడిపై ప్రభావం



పంటలకు ముందులు వేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: ఆరుగాలం శ్రమించే అన్నదాతకు పంట చేతికొచ్చేంత వరకు అగ్ని పరీక్షలే. పంటను కాపాడుకోవడానికి నిరంతరం పర్యవేక్షణతో పాటు సస్యరక్షణ చర్యలు తప్పనిసరి. వాతావరణం ఆధారంగా పంటను పరిశీలిస్తూ సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలి. తెగుళ్ల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వరిలో ప్రధానంగా కలుపు నివారణ కీలకమనే చెప్పాలి. కలుపును సకాలంలో నివారించకపోతే పంట దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం ఉంది. సకాలంలో కలుపు నివారణ చేపడితే పంట నాణ్యత పెరగడమే కాకుండా దిగుబడి ఎక్కువ వచ్చే అవకాశం ఉంది. ఇటీవల కాలంలో రైతులు ఎక్కువగా వరిలో వెదజల్లు పద్ధతి పాటిస్తున్నారు. ఈ పద్ధతి వల్ల వరిలో కలుపు పెరిగే ప్రమాదం ఉంది. దీనిని నిర్లక్ష్యం చేస్తే పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. వరిలో కలుపు తీత చేపట్టకపోతే వరికి చేరాల్సిన పోషకాలు, ఎరువులు గడ్డి మొక్కలు లాక్కుని పంట నాణ్యతను, దిగుబడిని నాశనం చేస్తాయి. అంతేకాకుండా తెగుళ్లు ఆశించి రైతుపై భారం పడే అవకాశం ఉంది. దీంతో ఎరువుల వినియోగం కూడా గణనీయంగా పెరిగిపోతుంది.

ఆలస్యంగా నాట్లు

ఈ ఏడాది ఖరీఫ్ వరి సాగులో రైతులకు ఇక్కట్లు తప్పలేదు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు రైతులను అయోమయంలోకి నెట్టేశాయి. దీంతో చాలా మంది రైతులు సాగుకు స్వస్తి పలికారు. గతేడాది కంటే ఈ ఏడాది సాగు గణనీయంగా పడిపోయింది. సకాలంలో వర్షాలు పడకపోవడంతో వరినారు ఆలస్యమైంది. ఫలితంగా నాట్లు కూడా ఆలస్యమయ్యాయి. ఎచ్చెర్ల మండలంలో సాధారణ విస్తీర్ణం 7,500 ఎకరాలు కాగా, ఈ ఏడాది 6,500 ఎకరాల్లో వరినాట్లు వేశారు.

ఇవే కలుపు మొక్కలు

గడ్డిజాతిలో వివిధ రకాలనే కలుపు మొక్కలు అంటారు. వీటిలో ఊదర, తుంగ, వెడల్పాకు, ఏకవార్షిక గడ్డి జాతులు ప్రధానమైనవి. ఇవి అనుకోని అతిథిలా పంటలోకి చొరబడి పంటకు ఇచ్చే పోషకాలను లాక్కుని పెరుగుతాయి. తద్వారా పంటకు పోషకాలు అందక దిగుబడిపై ప్రభావం చూపుతుంది. సాధ్యమైనంత వరకు వీటి నివారణ తప్పనిసరిగా చేపట్టాలి. ఇందుకోసం వ్యవసాయ శాఖాధికారుల సలహాలు, సూచనలు తీసుకుని తగు మోతాదులో క్రిమి సంహారక మందులు పిచికారీ చేయాలి. గతంలో కలుపుతీతను కూలీల ద్వారా చేపట్టేవారు. వరినారు వేశాక వివిధ దశల్లో కలుపు నివారణ చేసేవారు. కూలీల కొరత రావడంతో రైతులు ప్రత్యామ్నాయ పద్ధతులను అవలంభిస్తున్నారు.

జాగ్రత్తలు పాటించాలి

మార్కెట్‌లోకి కలుపు నివారణ కోసం అనేక రసాయనాలు వచ్చేశాయి. అవగాహన లేకుండా పబ్లిసిటీ మాయలో చిక్కుకుని ఇష్టానుసారంగా ఏది పడితే అది పిచికారీ చేస్తే దుష్ఫలితాలు కలిగే ప్రమాదం ఉంది. వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ తగిన మందును సకాలంలో మోతాదు ప్రకారం పిచికారీ చేస్తే కలుపు నివారణ జరిగి పంటలో దిగుబడి వచ్చే అవకాశం ఉంటుంది.

మందుల వినియోగం ఇలా..

కలుపు రాకుండా ముందస్తుగా వరినాట్లు వేసిన కొత్తలో 500 మి.లీ ప్రెటిలాకోర్ కలుపు ద్రావణాన్ని నీటిలో కలిపి పంట తడిచేలా పిచికారీ చేయాలి. రెండు నుంచి నాలుగు ఆకుల దశలో 8 గ్రాముల పెట్ సల్ఫూరావ్ లేదా క్లోరిమ్యూరాన్ ఈథేల్ మందును పిచికారీ చేయాలి. కలుపు ఎక్కువగా కనిపిస్తే 900 మి.లీ ఫెనాక్సులం లేదా సైహాలోపాస్ బ్యూటైల్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. ఇలా చేస్తే అన్ని రకాల కలుపు మొక్కలు నాశనమవుతాయి. కలుపు నివారణలో ఎప్పుడూ ఒకే రకమైన మందులను వినియోగించినా మంచి ఫలితాలు రావు.

యాజమాన్య పద్ధతులను పాటించాలి



రైతులు కలుపు నివారణను నిర్లక్ష్యం చేయకూడదు. కలుపు నివారణకు యాజమాన్య పద్ధతులను అవలంభించాలి. నాట్లు వేసినప్పటినుంచి కలుపుపై ఓ కన్నేసి ఉంచాలి. కలుపు కనిపిస్తే సకాలంలో తగు మెతాదులో తగిన మందును పిచికారీ చేయాలి. లేదంటే పంట దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

– వావిలాపల్లి రాజేష్,
మండల వ్యవసాయాధికారి, ఎచ్చెర్ల

వైఎస్సార్‌సీపీలో నియామకాలు

రణస్థలం: వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకు ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ లావేరు మండలంలోని పంచాయతీల పార్టీ కమిటీ అధ్యక్షులను నియమించారు. అదపాక – గొర్లె అప్పలనాయుడు, బెజ్జిపురం – దన్నాన అప్పలనాయుడు, బొంతుపేట – బొంతు సూర్యనారాయణ, బుడతవలస – రౌతు చిరంజీవి, బుడుమూరు – పెదనాయని అప్పలనర్సునాయుడు, చిన్న మురపాక – మీసాల సీతంనాయుడు, చిన్న రొంపివలస – పిసిని ఉపేంద్ర, చిన్నయ్యపేట – మీసాల అప్పలనాయుడు, గోవిందపురం – శేటికం రాంబాబు, గుమ్మడాం – నాగం కనకరాజు, గుంటుకుపేట – కొన్ని పరసయ్య, గుర్రాలపాలెం – షేక్ చాన్ భాషా, గురుగుబిల్లి– బాడిత రాంబాబు, కేశవరాయునిపాలెం – నాయన వెంకటరమణ, కొత్తకోట – మేడబోయిన శ్రీనివాసరావు, కొత్తకుంకాం – దొండపాటి వాసుదేవరావు, లక్ష్మీరం – కొండక త్రినాథరావు, లోపెంట – అలుపన మల్లేశ్వరరెడ్డి, మురపాక – బాలి శ్రీనివాసనాయుడు, పాత కుంకాం – శెటికం వెంకటరమణమూర్తి, పెద్దకొత్తపల్లి– బగ్గ హరిప్రసాద్, పెద్ద లింగాలవలస – లుకలాపు చిన్న శ్రీను, పెద్దరావుపల్లి – ఆరంగి శ్రీరామ్‌మూర్తి, పోతయ్యవలస – చిలకలపల్లి పరందామయ్య, సహపురం – నగిరెడ్డి బద్రి, సిగిరికొత్తపల్లి – మీసాల రామినాయుడు, తామాడ – కొమ్ము సాయి, తాళ్లవలస – దేశెట్టి తిరుపతిరావు, వెంకటాపురం – బొంతు ఎల్లంనాయుడులు గ్రామ పంచాయతీ పార్టీ కమిటీ అధ్యక్షులుగా నియమితులయ్యారు.

లఘు చిత్రాల పోటీల కరపత్రాలు ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డీఎస్పీ వివేకానంద తదితరులు

శ్రీకాకుళం కల్చరల్: సమాజానికి ఉపయోగపడేవిధంగా లఘు చిత్రాల నిర్మాణం జరగాలనే నిర్వాహకులు ఆలోచన ఉత్తమమైనదని డీఎస్పీ వివేకానంద అన్నారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో పీకే ఎంటర్‌టైన్‌మెంట్, ఎంసీఏల సంయుక్త ఆధ్వర్యంలో లఘుచిత్రాల పోటీల కరపత్రాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతలో సందేశాత్మక మార్పును కలిగించే విధంగా నిర్మించాలని సూచించారు. ఈ పోటీల్లో ఎటువంటి రుసుము లేకుండా పాల్గొనవచ్చని తెలియజేశారు. యువత మత్తు పదార్థాలకు బానిసలు కావడం వలన కలిగే దుష్ప్రభావాలు – నివారణ చర్యలు, తల్లిదండ్రుల గొప్పదనం, యువతపై సోషల్ మీడియా ప్రభావం, శ్రీకాకుళం జిల్లా గొప్పదనం, అక్రమ సంబంధాలు – వాటి ప్రభావాలు, బాల నేరాలు, పరివర్తన సంస్కరణ వంటి సందేశాత్మక, సామాజిక అంశాలతో నిర్మించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ సదవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోటీలో పాల్గొనేవారు తమ వివరాలను అక్టోబర్ 2వ తేదీ నుంచి 18వ తేదీలోపు నమోదు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 93817 06788 నంబరును సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పీకే ఎంటర్‌టైన్‌మెంట్ నిర్వాహకులు సతివాడ ప్రసాద్, మణిపాత్రుని నాగేశ్వరరావు, ఎం.తిరుపతిరావు, కీర్తి, సంజు, సామాజిక కార్యకర్తలు ఉర్లం శివతేజ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన అవసరం

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



వాక్‌థాన్ నిర్వహిస్తున్న యూనియన్ బ్యాంక్ అధికారులు, సిబ్బంది



నాగావళి వంతెన పక్కన చెత్తను తొలగిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు

శ్రీకాకుళం అర్బన్: పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన అవసరమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జిల్లా ఎన్విరాన్‌మెంట్ చైర్మన్ పొన్నాడ రవికుమార్ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని నాగావళి నది వద్ద ఉన్న వంతెనకు ఇరువైపులా పరిసరాలను పరిశుభ్రం చేసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛోత్సవ్‌లో భాగంగా పండిట్ దీన దయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకుని ఏక్ దిన్.. ఏక్ గంట.. ఏక్ సాథ్ పేరుతో ఈ కార్యక్రమం చేయడం సంతోషకరమన్నారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ డీవీడీ ప్రసాద్ మాట్లాడుతూ డే అండ్ నైట్ కూడలి వద్ద పరిసరాలు, నాగావళి నది వంతెనకు ఇరువైపులా ఉన్న చెత్త, కాలువల్లోని పూడికలు తీసే కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. అనంతరం శ్రీకాకుళం సెంట్రల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పరిసర ప్రాంత ప్రజలకు గుడ్డ సంచులను అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ అధికారి డా.సుధీర్, మున్సిపల్ ఇంజినీర్ బి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత గురుతర బాధ్యత

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి గురుతర బాధ్యత అని యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ పైడి రాజా అన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శ్రీకాకుళం రీజనల్ ఆఫీస్ ఆధ్వర్యంలో ఏక్ దిన్ – ఏక్ గంటా – ఏక్ సాత్ నినాదంతో వాక్‌థాన్, స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ – స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కలను సాకారం చేయడంలో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. లీడ్ బ్యాంకు మేనేజర్ పేడాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని బ్యాంకుల్లో ఇటువంటి కార్యక్రమాలు శ్రద్ధగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ జాయింట్ డైరెక్టర్ త్రినాథ స్వామి, యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ ఉపాధికారి రవి, చీఫ్ మేనేజర్లు విశ్వనాథ్, గాయత్రి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం



గణపతి హోమం చేస్తున్న రుత్విక్కులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో వేంచేసిన విజయ గణపతి ఆలయంలో ఆశ్వీయుజ శుద్ధ పంచమి సందర్భంగా గణపతి హోమం గురువారం జరిగింది. ఆలయ అర్చకులు పెంట శ్రీధరశర్మ, సూర్యనగేష్ శర్మల ఆధ్వర్యంలో మూల మంత్ర సహిత గణపతి హవనం చేశారు. భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కేజీబీవీ విద్యార్థినులు



మేఘన



స్వాతి

జి.సిగడాం: స్థానిక కేజీబీవీలో చదువుతున్న బాలికలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఐ.ప్రమీల గురువారం తెలిపారు. ఈనెల 14న జిల్లాస్థాయిలో నిర్వహించిన జూనియర్ అథ్లెటిక్స్ పోటీలో అండర్–16 విభాగంలో ఆర్. స్వాతి, అండర్–18 విభాగంలో జి.మేఘన ఎంపికయ్యారు. వీరు ఈనెల 27 నుంచి 29 వరకు గుంటూరు జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు హాజరవుతారని వెల్లడించారు.

కాలువల మరమ్మతులు



కాలువ పనులు చేపడుతున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ వెనుక భాగంలో ఉన్న కాలువలు పూర్తిగా పాడైపోవడంతో వాటికి ఆర్టీసీ అధికారులు మరమ్మతులు చేపడుతున్నారు. కాంప్లెక్స్ చుట్టూ ప్రధాన కాలువ ఉంది. కాంప్లెక్స్ వెనుకభాగంలో ఉన్న కాలువ చాలా ఏళ్ల క్రితం రాతికట్టు కట్టిన కాలువ కావడంతో ఆ కాలువ పూర్తిగా పాడైపోయింది. దీని స్థానంలో ఇప్పుడు కొత్తగా కాంక్రీట్ గోడలతో కాలువ నిర్మాణ పనులు చేపడుతున్నారు. అలాగే కాంప్లెక్స్‌కు ఇరువైపులా ఉన్న సిమ్మెంట్ రోడ్లు కూడా చాలా చోట్ల గోతులమయం అయ్యాయి. దీనికి తోడు చిన్నపాటి వర్షం పడితే చాలు కాంప్లెక్స్ మొత్తం నీటితో నిండిపోవడం, వర్షపు నీటికి గోతులు మరింత పెద్దవి కావడంతో బస్సుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీంతో ఆ గోతులను కూడా పూడ్చే పనిలో ఆర్టీసీ అధికారులు నిమగ్నమయ్యారు.

మూలుగుతున్న మొక్కలు



శ్రీకాకుళం నగరంలోని సుడా కార్యాలయం ఆవరణలో గత కొన్ని నెలలుగా మొక్కలు మూలుగుతున్నాయి. గతంలో కూడా రథసప్తమి పేరిట వేలాది మొక్కలు తీసుకొచ్చి కార్యాలయం ఆవరణలో పెట్టి ఎండగొట్టారు. ప్రస్తుతం కార్యాలయ ఆవరణలో ఉన్న మొక్కల పరిస్థితి కూడా అలాగే ఉంది. దీంతో ఇప్పటికైనా అధికారులు స్పందించి మొక్కలను నాటేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

జలమయం





శ్రీకాకుళం నగరంలో గురువారం సాయంత్రం కుండపోత వర్షం కురవడంతో నగరమంతా జలదిగ్బంధంలో చిక్కుకుంది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. అరగంటలో నగరమంతా జలమయమవ్వడంతో నగర ప్రజలు అవస్థలు పడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

ఫార్మశీ రంగంలో ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న జగదీశ్వరరావు



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

ఎచ్చెర్ల: ఫార్మసీ రంగంలో ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉంటాయని డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ అసిస్టెంట్ మేనేజర్ కె.జగదీశ్వరరావు అన్నారు. మండలంలోని చిలకపాలేం శివానీ ఫార్మసీ కాలేజీ ఆవరణలో వరల్డ్ ఫార్మసీ డే వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మసీ నాలుగేళ్లలో అధ్యాపకులు చెప్పినవి విద్యార్థులు నేర్చుకుంటే ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఈ రంగంలో ముందు భద్రత చూసుకుని, తర్వాత నాణ్యత, ఉత్పాదకత చూసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం వివిధ రకాల పోటీల్లో విజేతలకు పతకాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో విశిష్ట అతిథిగా ఫార్మసీ అధికారి ఎస్.సింహాచలం, యాజమాన్య ప్రతినిధులు వి.ఎం.సాయినాథ్‌రెడ్డి, పి.దుర్గా ప్రసాద్‌రాజు, దుప్పల వెంకటరావు, డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ రాజ్‌కిరణ్, ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటిన శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ జట్లు



క్రీడాకారులను అభినందిస్తున్న ట్రిపుల్ ఐటీ సిబ్బంది

ఎచ్చెర్ల: నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఈనెల 22, 23 తేదీల్లో కబడ్డీ, ఫెన్సింగ్ క్రీడా విభాగాలకు సంబంధించి ఇంటర్ కాలేజీల టోర్నమెంట్ ఎంపికలను నిర్వహించారు. నాలుగు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ల నుంచి క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. కబడ్డీలో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ బాలురు, బాలికల జట్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. అక్టోబర్ 7న బెల్గాం(కర్ణాటక)లో జరగనున్న సౌత్ జోన్ క్రీడలకు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ తరఫున 6 మంది బాలురు, 5 మంది బాలికలు చొప్పున మొత్తం 11 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రొఫెసర్ కేవీజీడీ బాలాజీ విజేతలకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో పరిపాలక అధికారి మునిరామకృష్ణ, డీన్ ఆఫ్ అకడమిక్స్ శివరామకృష్ణ, ఫైనాన్స్ అధికారి సీహెచ్ వాసు, డీన్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ జి.రవి, పీడీలు సీహెచ్ కృష్ణంరాజు, టి.దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ పరమేశ్వరి.. అఖిలాండేశ్వరి



జి.సిగడాం: కాత్యాయనీదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు



శ్రీకాకుళం కల్చరల్: గుడివీధిలో బాలత్రిపుర సుందరిగా రాజరాజేశ్వరి



శ్రీకాకుళం కల్చరల్: సంతోషిమాత ఆలయంలో పూజలు



శ్రీకాకుళం కల్చరల్: మొండేటివీధిలో లలితాదేవిగా దర్శనం

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నాలుగో రోజైన గురువారం అమ్మవారు వివిధ అలంకరణలో దర్శనమివ్వగా.. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

–సాక్షి నెట్‌వర్క్